సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం | 9 | ఆగస్టు | 2025



వేలం... కూటమి గాలం

వేలం నిర్వహించకుండా కూటమి గాలం వేసింది.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమకు నచ్చిన వారికి మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంది..


8లో



అన్న ప్రసాద భవనానికి రూ.లక్ష

కొత్తపేట: వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో వకుళమాత అన్న ప్రసాద భవన నిర్మాణానికి గొడవర్రి మంగ బేబీ సరోజ, గొడవర్తి యశ్వంత్ కిరణ్ కుమార్ (మండపేట) రూ.1,00,116 అందజేశారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం సాయంత్రం 98,536 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది. గోదావరి డెల్టా కాలువలకు సంబంధించి 14,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

గొప్పలు కాదు.. సాధించిన పనులు చెప్పండి



తెన్నేటి కిషోర్

అమలాపురం టౌన్: గొప్పలు చెప్పడం కాకుండా గడిచిన 14 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో కేంద్రం నుంచి ఇప్పటి వరకూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్ని నిధులు తెచ్చారో, ఏం పనులు చేశారో వెల్లడించాలని జనసేన పార్టీ నేతలను వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ ప్రశ్నించారు. అమలాపురంలో కిషోర్ శుక్రవారం మాట్లాడుతూ ముఖ్యంగా పి.గన్నవరం జనసేన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఈ ప్రశ్నకు బదులు చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు శంకుస్థాపనలు చేసి పనులు మొదలు పెట్టడం, తదితర అభివృద్ధి పనులకు కొనసాగింపుగా కేంద్రం నుంచి పవన్ కల్యాణ్ ప్రధాన మంత్రిని ఒప్పించి ఏ మేరకు నిధులు తెచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. పవన్‌కల్యాణ్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, ఇప్పటికైనా పొగడ్తలు ఆపి వాస్తవాలు మాట్లాడాలని జనసేన నేతలకు కిషోర్ సూచించారు.

రెవెన్యూ శాఖలో ఏడుగురికి డిప్యుటేషన్లు

అమలాపురం రూరల్: పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా జిల్లా రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్ల క్యాడర్‌లో పనిచేస్తున్న వారికి డిప్యుటేషన్లు వేశారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఏడుగురికి డిప్యుటేషన్లు నియమిస్తూ ఇన్‌చార్జి డీఆర్‌ఓ, ఆర్డీవో కొత్త మాధవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముమ్మిడివరం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జయకుమారిని అమలాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీగా, కాట్రేనికోన డిప్యూటీ తహసీల్దార్ ఐ.జగదీష్‌ను ముమ్మిడివరం డీసీఎస్‌ఓకు వేశారు. పోలవరం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వి.రవికిరణ్‌ను కాట్రేనికోనకు వేశారు. ముమ్మిడివరంలో (రీ-సర్వే) విభాగం డిప్యూటీ తహసీల్దార్ జి.లలితను ఉప్పలగుప్తంకు, ఉప్పలగుప్తం డిప్యూటీ తహసీల్దార్ జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యంను అయినవిల్లికి, ముమ్మిడివరం సీనియర్ అసిస్టెంట్ ఎం.దుర్గా శ్రీనివాస్‌ను రాజోలు డీటీగా వేశారు.

వారాహిగా వనదుర్గమ్మ



అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణ మాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అమ్మవారు వారాహిమాత అలంకరణలో కనువిందు చేశారు. రెండు చేతుల్లో శంఖు చక్రాలు, మరో చేతిలో శూలం ధరించి మరో చేయి అభయహస్తంగా చూపుతూ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, బాల, కన్య, సువాసినీ పూజలు, చండీ పారాయణలు నిర్వహించారు.

సాగుకు పంటగెక్కడ!

జిల్లాలో 2025-26లో మండలాల వారీగా ఖరీఫ్ సాగు	
ఆత్రేయపురం	5,048
మండపేట	16,679
రాయవరం	14,667
రామచంద్రపురం	18,526
ఆలమూరు	9,947
రావులపాలెం	5,068
కొత్తపేట	7,833
కపిలేశ్వరపురం	16,052
కె.గంగవరం	15,713
ఐ.పోలవరం	5,811
ముమ్మిడివరం	5,293
అయినవిల్లి	8,291
పి.గన్నవరం	6,284
అంబాజీపేట	3,147
మామిడికుదురు	2,575
రాజోలు	3,548
మలికిపురం	793
సఖినేటిపల్లి	335
అల్లవరం	2,877
అమలాపురం	4,872
ఉప్పలగుప్తం	4,795
కాట్రేనికోన	5,251



అల్లవరం మండలం రెబ్బన్నపల్లిలో తొలకరి సాగు చేయకుండా వదిలేసిన వరి చేలు

- తగ్గిపోతున్న వ్యవసాయం
- జిల్లాలో 2.71 లక్షల ఎకరాల ఆయకట్టు
- ఖరీఫ్‌లో 1.63 లక్షల ఎకరాల్లోనే సాగు
- గిట్టుబాటు కాక ముందుకు రాని రైతులు
- ముంచేస్తున్న ఆక్వా, మురుగునీటి కాలువలు

సాక్షి, అమలాపురం: రైతు పండించిన పంట ఊరిలోకి రాగానే పండగ మొదలయ్యేది.. సార్వా చేతికి వచ్చిన తర్వాత వరసగా దసరా.. దీపావళి వస్తోంది. దాళ్వా ధాన్యం ఇళ్లకు చేరిన తర్వాత సంక్రాంతి పండగలతో ప్రతి గ్రామం కళకళలాడుతోంది. అటువంటిది ఇప్పుడు రైతు సాగుకు పూనుకోవడమే పండగ అయ్యింది. ఏడాదికి రెండు పంటలు వరి, మూడో పంట అపరాలతో సస్యశ్యామలంగా ఉండే డెల్టా భూముల్లో, ఇప్పుడు ఒక పంటే గగనం అవుతోంది. ప్రధాన పంట వరి పండినా గిట్టుబాటు కాకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోవడం వంటి కారణాలతో రైతులు ఆ సాగుకు దూరమవుతున్నారు. జిల్లాలో 2010లో వరి ఆయకట్టు 2,84,742 ఎకరాలు కాగా, ఇప్పుడు ఖరీఫ్‌లో సాగు లక్ష్యం కేవలం 1,63,399 ఎకరాలు మాత్రమే. అంటే సుమారు 1,21,343 ఎకరాల్లో వరి సాగు లేకుండా పోయింది. 2011లో జిల్లాలో జరిగిన సాగు సమ్మె తరువాత వరి సాగు గణనీయంగా తగ్గిపోతోంది. వరి చేలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా, ఉద్యాన పంటలుగా, ఆక్వా సాగుగా మారిపోతున్నాయి. మరికొన్ని చోట్ల రైతులు సాగు చేయకుండా వదిలేస్తున్నారు.

మూడొంతులు.. ముక్కచెక్కలు

2010 సమయంలో అల్లవరం డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ) పరిధిలో అల్లవరం మండలం పూర్తిగా, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం, గోపవరం, చల్లపల్లి, కిత్తనచెరువు, సరిపల్లి, అమలాపురం మండలం వన్నెచింతలపూడి, సమనస గ్రామాలున్నాయి. కాట్రేనికోన డీసీ పరిధిలో కాట్రేనికోన మండలంతో పాటు ఉప్పలగుప్తం మండలంలో మిగిలిన గ్రామాలున్నాయి. ఈ రెండు డీసీల పరిధిలో మొత్తం ఆయకట్టు 53,341 ఎకరాలు ఉంది. ఇప్పుడు వరి సాగు కేవలం 17,795 ఎకరాల్లో మాత్రమే జరుగుతోంది. వరి గిట్టుబాటు కాక రైతులు ఆక్వా సాగు వైపు వెళ్లిపోవడంతో మూడొంతుల సాగు కుదించుకుపోయింది.

2010లో మధ్య డెల్టా ఆయకట్టు

డీసీ పరిధి	వరి ఆయకట్టు (ఎకరాలు)
అల్లవరం	23,567
అవిడి	18,291
గోపాలపురం	11,141
కాట్రేనికోన	29,774
మురమళ్ల	22,216
అమలాపురం	17,390
అయినవిల్లి	15,683
పి.గన్నవరం	24,309
రాజోలు	23,129
మొత్తం ఆయకట్టు	1,81,578

తూర్పు డెల్టా (కోనసీమ జిల్లా పరిధిలో)

మండపేట	18,018
రామచంద్రపురం	19,679
సిరిపురం	20,284
యర్ర పోతవరం	18,753
ఆలమూరు	14,698
కోటిపల్లి	11,732
మొత్తం ఆయకట్టు	1,03,164

కనీస మద్దతు ధర లేక..



వరి ధాన్యానికి కేంద్రం ఇస్తున్న కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) గోదావరి డెల్టాలో గిట్టుబాటు కావడం లేదు. ధాన్యానికి కేంద్రం ఈ ఏడాది ప్రకటించిన ఎంఎస్‌పీ క్వింటాలుకు రూ.2,369గా ఉంది. రూ.మూడు వేలు ఉంటే పెట్టుబడులు వస్తే గొప్ప. మురుగునీటి పారుదల వ్యవస్థ మొత్తం దెబ్బతింది. తొలకరి సాగు అంటే జూదంగా మారిపోయింది. రెండో పంటకు నీరు అందడం గగనమైంది. సాగు సమ్మె తరువాత రైతులు డెల్టాలో తొలకరి సాగు చేయడం పెద్దఎత్తున మానేస్తున్నారు.

– కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రామచంద్రపురం

సాగు చేస్తే నష్టపోతున్నాం



నేను సుమారు పదెకరాల్లో వరి పండించేవాడిని. పదేళ్ల కిందటి వరకూ సార్వా, దాళ్వా పంటలతో పాటు అపరాలు వేసేవాడిని. ఇప్పుడు సాగు చేసే పరిస్థితి లేక సేద్యానికి స్వస్తి పలికాను. రాజోలు దీవిలో మురుగునీటి కాలువకు ఇరువైపులా ఆక్వా చెరువులు తవ్వేశారు. పంట కాలువలో సాగునీరు పారడం లేదు. మురుగునీటి కాలువల ద్వారా ముంపునీరు దిగే అవకాశం లేకుండా పోయింది. సాగు చేస్తే నష్టపోతున్నాం.

– వీరా గోపాలకృష్ణ, ఉయ్యూరువారిమెరక, సఖినేటిపల్లి మండలం

మాయమై.. దూరమై..



అంబాజీపేట మండలంలో కొబ్బరి తోటలుగా మారిన వరి చేలు

మురమళ్ల, అయినవిల్లి పాత డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 37,899 ఎకరాల ఆయకట్టు ఉండేది. ఇప్పుడున్న వరి ఆయకట్టు 21,150 మాత్రమే. ఇక్కడ పొలాలు ఆక్వా చెరువులుగా మారడంతో పాటు అయినవిల్లి, అంబాజీపేట వంటి ప్రాంతాల్లో భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా, కొబ్బరి తోటలుగా మారిపోయాయి. ఫలితంగా వరి సాగు దూరమైంది.

ముందుకు కొనసాగులేక..



సఖినేటిపల్లి మండలం గొందిలో ఉప్పు మడులను తలపిస్తున్న వరి చేలు

రాజోలు, పి.గన్నవరం డీసీల పరిధిలో 2010లో ఆయకట్టు మొత్తం 49,190 ఎకరాలు. కానీ ఇప్పుడు ఆయకట్టు ఎంతో తెలుసా? కేవలం 13,535 ఎకరాలు మాత్రమే. ఇందులో ఒక్క పి.గన్నవరం మండలంలోనే 6,284 ఎకరాలు కావడం విశేషం. అంటే మిగిలిన నాలుగు మండలాల్లో ఆయకట్టు 7,251 ఎకరాలే. ఇందులో మలికిపురం మండలంలో 793 ఎకరాలు, సఖినేటిపల్లి మండలంలో కేవలం 335 ఎకరాలు మాత్రమే. ఈ మండలంలో తొలకరి పంట సాగు చేసే రైతును అబ్బురంగా చూసే పరిస్థితి నెలకొంది.

కొంచెం.. కొంచెంగా తగ్గుతూ..

తూర్పు డెల్టాలోని మండపేట, రామచంద్రపురం, సిరిపురం, ఎర్ర పోతవరం, ఆలమూరు, కోటిపల్లి డీసీల పరిధిలో మొత్తం 1,03,164 ఎకరాల ఆయకట్టు ఉండేది. ఇప్పుడు 91,584 ఎకరాలకు తగ్గిపోయింది. అంటే సుమారు 11,580 ఎకరాల ఆయకట్టు తగినట్టు అంచనా. మధ్య డెల్టాతో పోల్చుకుంటే వరి మానేసిన రైతులు ఇక్కడ తక్కువనే చెప్పాలి. ముంపు తీవ్రత తక్కువగా ఉండటం, అధిక దిగుబడులు రావడం వల్ల రైతులు ఇంకా వరి వైపే ఉన్నారు. అయితే కె.గంగవరం, రామచంద్రపురం రూరల్ వంటి ప్రాంతాల్లో ఇటీవల కాలంలో ఆక్వా పెరుగుతుండడం గమనార్హం.



కె.గంగవరం మండలం బాలాంత్రం వద్ద ఆక్వా సాగు

పులివెందుల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

మాజీ ఎంపీ చింతా అనురాధ



అల్లవరం: పులివెందులలో ఈ నెల 12న జరగనున్న జెడ్పీటీసీ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతుందన్నారు. పార్టీ సానుభూతిపరుల ఆస్తులు, వాహనాలను ధ్వంసం చేస్తూ అరాచకాలు చేస్తుందని అనురాధ ఆరోపించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తున్న కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు పోలీసులను అధికార దుర్వినియోగానికి వాడుకుంటూ, ఎన్నికల కమిషన్‌ను ప్రభావితం చేసి పోలింగ్ కేంద్రాలను ఉన్న పళంగా మార్చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగల్లో తొక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. పులివెందుల ప్రజలు మేల్కొని కూటమి అభ్యర్థిని జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓడించాలని ఆమె కోరారు.

11న క్రీడా పోటీలు

అమలాపురం రూరల్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో నిర్వహించే ఎంపికలు అనివార్య కారణాలతో ఈ నెల 11కు వాయిదా వేసినట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పీఎస్ సురేష్ కుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి అమలాపురం బాలయోగి స్టేడియంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పది క్రీడాంశాల్లో 8న బాలురు, 9న బాలికలకు నిర్వహించాల్సి ఉండగా సెలువు రోజులు కావడంతో వాయిదా వేశామన్నారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయని సురేష్ కుమార్ వివరించారు.

సిరుల తల్లి.. కల్పవల్లి

రాయవరం: సిరుల తల్లి.. కల్పవల్లి ప్రణామం అంటూ ఆ వరలక్ష్మీదేవిని భక్తులు కొలిచారు. జిల్లాలో శ్రావణ శుక్రవారం పూజలను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇక్కడ సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. అలాగే వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



వెదురుపాకలో విజయదుర్గా అమ్మవారు

ముడుపు కట్టు.. ముక్క పట్టు!



- ఒక లైఫ్, రెండు జోకర్లుగా సాగుతున్న పేకాట శిబిరాలు
- కానులు బోగేసుకోవడంలో కూటమి నేతల బిజీబిజీ
- ముఖ్య నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా తమ్ముళ్ల దందా

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఎవరికీ డబ్బులు ఊరకనే రావు అంటుంటారు ఒక నగల వ్యాపారి. కూటమి నేతలకు మాత్రం వద్దంటే డబ్బు వచ్చి పడిపోతోంది ఊరకనే. అందుకు ఎన్నో మార్గాలు. అందులో ఒకటి పేకాట శిబిరాలు. కూటమి నేతల కనుసన్నల్లో ఎన్నో శిబిరాలు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. పలు నియోజకవర్గాల్లో పేకాట డెన్‌లు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నియోజకవర్గాల్లో ముఖ్య ప్రజాప్రతినిధులకు మామూళ్లు ముట్టజెబుతూ పేకాట శిబిరాలను అడ్డూ అదుపూ లేకుండా నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరో నెల నుంచే పేకాట శిబిరాలతో పేట్రేగిపోతున్నారు. వీటిని కట్టడి చేసేందుకు పోలీసులు కదనరంగంలోకి దిగినప్పటికీ అధికార పార్టీ పెద్దల అండదండలు, నిర్వాహకుల ముడుపుల ముందు అవి దిగదిడుపు అవుతున్నాయి.

పేకాట శిబిరాల్లో లక్షలు చేతులు మారుతున్నాయి. పేకాట మోజులో పడి మధ్య తరగతి కుటుంబాలు చిన్నాభిన్నమైపోతున్నాయి. పేకాట డెన్ నిర్వహించాలంటే ముందుగా నియోజకవర్గ ముఖ్యనేతతో బేరం కుదుర్చుకోవాలి. పోలీసులతో నెలవారీ మామూళ్ల లెక్కల్లో మాట్లాడుకోవాలి. ఈ ప్రక్రియ అంతటినీ నియోజకవర్గాల నేతల ముఖ్య అనుచరులు చక్కబెడుతున్నారు. నిర్వాహకులు గుట్టు చప్పుడు కాకుండా పేకాటను మూడు ఆసులు, ఆరు ఢంకాలుగా నిర్వహిస్తున్నారు. జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ రూరల్, రాజానగరం, కమలనాథులు ప్రాతినిధ్యం వహిస్తున్న అనపర్తి, టీడీపీ ఏలుబడిలో ఉన్న రామచంద్రపురం, మండపేట, ముమ్మిడివరం, అమలాపురం తదితర నియోజకవర్గాలతో పాటు పాండిచ్చేరి కేంద్రపాలిత యానాంలో కూడా విచ్చలవిడిగా పేకాట శిబిరాలు నడుస్తున్నాయి.

తుని మొదలు కాకినాడ రూరల్ వరకు డజన్ల కొద్దీ పేకాట శిబిరాలు నడుస్తున్నాయి. తునిలో రెండు స్థావరాల్లో పేకాట నడుస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానం సమీపాన ప్రైవేటు రిసార్ట్స్, తుని సాయినగర్‌లలో వారంలో మూడురోజులు పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. టీడీపీ పెద్దల అండదండలతో తమ్ముళ్ల కనుసన్నల్లో నడుస్తున్న పేకాట స్థావరాలకు విశాఖజిల్లా పాయకరావుపేట, నర్సీపట్నం నుంచి జూదప్రియులు క్యూకడుతున్నారు. సాయినగర్‌లోని ఒక టీడీపీ నాయకుడి ఇంటినే డెన్‌గా మార్చేసిన విషయం తెలిసినా పోలీసులు అటు వైపు తొంగి చూడలేని పరిస్థితి. తమ్ముళ్లకు, పోలీసులకు నెలవారీ మామూళ్లు ఇవ్వడంతో పేకాట స్థావరాలకు అడ్డూ అదుపూ లేకుండా ఉంది. కాకినాడ రూరల్‌లో రమణయ్యపేట, ఇంద్రపాలెం, రాయుడుపాలెం తదితర ఐదారు ప్రాంతాల్లో పేకాటక్లబ్‌లు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ నేతకు నమ్మినబంట్లైన ఇద్దరు ముఖ్య అనుచరులు ఈ వ్యవహారాన్ని చక్కబెడుతున్నారని సమాచారం. ఈ పేకాటడెన్‌లలో వారం వారం రూ.50 లక్షలు నుంచి రూ.70 లక్షలు లావాదేవీలు జరుగుతున్నాయి. అన్నీ కలిపి నెలకు జనసేన ముఖ్యనేతకు రూ.లక్ష ఇచ్చేలా కుదిరిన ఒప్పందం ప్రకారం మొదటి వారంలోనే సరిపెట్టేస్తున్నారు. స్టేషన్‌కు రూ.50 వేలు ముట్టచెబుతుండబట్టే పోలీసులు అటువైపు కన్నెత్తిచూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

కాకినాడ రూరల్ నియోజకవర్గ సరిహద్దు అనపర్తి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పేకాట స్థావరాలు నడుస్తున్నాయి. కమలనాథులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని రామవరం కేంద్రంగా పెద్ద పేకాట శిబిరం నడుస్తోంది. రామవరంతో పాటు కుతుకులూరు, పొలమూరు, దుప్పలపూడి, పీరా రామచంద్రపురం, పెడపర్తిలో పేకాట స్థావరాలు నడుస్తున్నాయి. వీటిలో రామవరం ప్రధాన స్థావరంగా నడుస్తోంది. నియోజకవర్గ ముఖ్యనేత మధ్యవర్తిత్వంతో రామవరం పేకాట డెన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన గోకులం షెడ్డునే పేకాట శిబిరంగా మార్చేశారు. షెడ్డు నిర్మాణానికి రామవరం గ్రామ పంచాయతీ అనుమతి ఇవ్వగా అధికారులు భయపడి ఎంబుక్ రికార్డు చేయకుండా వదిలేశారు. రామవరం పేకాట శిబిరం అనపర్తి, ద్వారపూడి, రాజమహేంద్రవరం, కాకినాడ, కడియం, మండపేట, రావులపాలెం, ద్రాక్షారామ తదితర ప్రాంతాల నుంచి వచ్చే జూదగాళ్లతో కిటకిటలాడుతోంది. బ్యాచ్, బ్యాచ్‌లుగా వచ్చి గుట్టుచప్పుడు కాకుండా పేకాటాడుతున్నా పోలీసులు కిమ్మనడం లేదు. రామవరం డెన్‌లో నిత్యం రూ.70 లక్షల నుంచి రూ.90 లక్షల జూదం జరుగుతోందని అంచనా. ముఖ్యనేత ఇంటికి 500 మీటర్ల దూరంలోనే పేకాట శిబిరం నడుస్తుండటంతో పోలీసులు కూడా చూసీచూడనట్టు పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల పోలీసులు నిర్వహించిన దాడిలో శిబిరం నిర్వాహకుడి ముఖ్యనేత ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టే ప్రధాన అనుచరుడేనని తేలింది. రామవరం శిబిరంలో ముక్కతిప్పిన రోజు లక్షన్నర ముఖ్యనేతకు ముట్టచెబుతున్నారని సమాచారం. టీడీపీ యువనేత వాటా యువనేతకు వెళ్లిపోతోందంటున్నారు. మంత్రి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గంలో పేకాట స్థావరాలకు కొదవులేకుండా ఉంది. ముచ్చిమిల్లి రోడ్డు, శ్రీ సిటీ, శీలంవారి సావరం, రూరల్‌లోని చోడవరం, అన్నయ్యపేట, కూళ్ల, మసకపల్లి, పామర్రు తదితర ప్రాంతాల్లో పేకాట శిబిరాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. వీటిలో కూళ్ల, మసకపల్లి, పామర్రు శిబిరాలు అధికార పార్టీ పెద్దల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యనేత అండదండలతోనే పేకాట స్థావరాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి. జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న రాజానగరం నియోజకవర్గంలో పుణ్యక్షేత్రం, శ్రీరామపురం, మల్లంపూడి, శ్రీరంగపట్నం, మధురపూడి, గాడాల, రఘుదేవపురం, వంగలపూడి, మిర్తిపాడులలో పేకాట శిబిరాలు గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్నారు. ఇక్కడి ముఖ్యనేతకు నెలనెలా లక్ష నుంచి లక్షన్నర ముడుపులు మూటగడుతున్నారని ఆనోటా ఈ నోటా వినిపిస్తోంది. ఇలా పలు నియోజకవర్గాల్లో పేకాట స్థావరాలు అడ్డూ అదుపులేకుండా నడుస్తున్నా పోలీసులు అడపాదడపా దాడులు చేస్తున్నారు తప్ప జూదాలను అరికట్టడంలో విఫలమవుతున్నారని చెవులు కొరుక్కుంటున్నారు.



ఇటీవల పోలీసులు దాడి చేసి 27 మందిని అరెస్టు చేసిన అనపర్తి మండలం రామవరంలోని డెన్ ఇదే..

క్లుప్తంగా

భీమేశ్వరాలయ ప్రధాన అర్చకుడి మృతి


కళ్లేపల్లి ఫణి కుమార్ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ కళ్లేపల్లి ఫణికుమార్ (83) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయనకు ఒక కుమారుడు శ్రీనివాస్, కుమార్తె సుందరి ఉన్నారు. ఆయన మృతికి సంతాపంగా భీమేశ్వరాలయాన్ని శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మూసివేశారు. ఆయన మృతికి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని, ఆలయ అర్చకులు కళ్లేపల్లి విశ్వప్రకాశ్, జుత్తుక శ్రీకాంత్, పురోహితులు దొంతుర్తి శ్రీరామచంద్రమూర్తి, మేడవరపు శ్రీనివాస చింతామణి ఆర్యవైశ్య సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి చెరుకు బాబూరావు, దేవాలయ వైదిక బృందం, ఆలయ సిబ్బంది తమ సంతాపాన్ని తెలియజేశారు.

మెట్లపై నుంచి జారిపడి తాపీమేస్త్రి దుర్మరణం

అల్లవరం: మండలంలోని బెండమూర్లంక గ్రామంలో యాళ్ల వెంకట రామ్మోహనరావుకు చెందిన నూతన గృహ నిర్మాణ పనులు చేస్తుండగా తాపీమేస్త్రి ముత్యాల వీరన్నబాబు (47) ప్రమాదవశాత్తు శుక్రవారం జారిపడి మృతి చెందాడు. దీనిపై అల్లవరం ఎస్సై బి.సంపత్‌కుమార్ కథనం ప్రకారం.. శుక్రవారం ఇంటి పనులు చేస్తుండగా మెట్లపై నుంచి జారిపడి తాపీమేస్త్రి వీరన్నబాబు అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. అతనితో పనిచేస్తున్న సహచర కూలీలు వీరన్నబాబును హుటాహుటిన అమలాపురంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడని ఎస్సై వివరించారు. మృతుడి కుమారుడు ముత్యాల సాయి పవన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	27,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	26,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	18,000 – 19,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	6,000
ఒక కిలో	400

శాస్త్ర చికిత్సలు..

- ప్రసవాలకూ ముహూర్తాలు
- ఎప్పుడు కనాలో పురోహితులను సలహా అడుగుతున్న కుటుంబ సభ్యులు
- 16 నెలల కాలంలో 74 శాతం సిజేరియన్లు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్యారోగ్యశాఖ



రాయవరం: పంతులు గారూ.. మా పాపకు తొమ్మిదో నెల వచ్చిందండి. సిజేరియన్ చేయించడానికి మంచి ముహూర్తం పెడతారా.. అంటూ తల్లిదండ్రులు పురోహితులను అడుగుతున్నారు. సాధారణంగా వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర శుభకార్యాలకూ ముహూర్తాలు చూపించడం సహజం. ఇప్పుడు ప్రసవాలకూ ముహూర్తాలు పెట్టించుకునే రోజులు దాపురించాయి. ఉరుకులు, పరుగుల జీవితంలో చిన్న సమస్య వచ్చినా తట్టుకునే గుణం తగ్గిపోయింది. అందుకే పిల్లలకు జన్మనివ్వడంలోనూ కొందరు నొప్పిని భరించలేకపోతున్నారు. మరికొందరు జాతకాల పిచ్చితో మంచి ముహూర్తం పెట్టించుకుని మరీ కాన్పులకు సిద్ధపడుతున్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా సిజేరియన్లు పెరిగిపోతున్నాయి. ఫలితంగా తల్లులు దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

ఒత్తిడికి గురిచేస్తూ..

ప్రైవేట్ ఆసుపత్రులకు వచ్చే వారిలో ఎక్కువ మంది ముహూర్తపు కాన్పులే చేయించుకుంటున్నారు. రోజు, తేదీ, సమయం వంటివి కుటుంబ సభ్యులు చూసుకుంటున్నారు. వైద్యులు సాధారణ కాన్పుల కోసం ప్రయత్నిస్తున్నామంటే... ఏమైనా అయితే మీదే బాధ్యతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీంతో వైద్యులు వారి ఒత్తిడికి తలొగ్గుతున్నారు.

అవగాహన లోపం.. పిల్లలకు శాపం

సిజేరియన్ల కారణంగా పిల్లలు ముర్రుపాలకు దూరమవుతున్నారు.. తల్లికి మత్తు సూది ఇస్తారు కాబట్టి పాలు పట్టకూడదన్న అపోహతో దూరం చేస్తున్నారు. పుట్టిన వెంటనే అనారోగ్య సమస్యల కారణంగా శిశువును ఆస్పత్రిలో చేర్చాల్సి వచ్చినప్పుడు మొదటిసారి పాలు అందడం లేదు. సాధారణం అయితే పుట్టిన గంటలోపు, సిజేరియన్ అయితే రెండు గంటల్లోపు ముర్రు పాలు పట్టించాలని వైద్యులు చెబుతున్నారు. తల్లిపాలు జీర్ణాశయాంతర వ్యాధుల నుంచి ఇన్ఫెక్షన్లు సోకకుండా కాపాడుతుంది. నవజాత శిశువు మరణాలను తగ్గిస్తుంది. కేవలం 34 శాతం మంది శిశువులు మాత్రమే మొదటి గంటలో ముర్రుపాలు తాగుతున్నారు.

ఏ రోజో నిర్ణయించుకుని..

ఈ రోజుల్లో ఎక్కువ మంది ముహూర్తపు ప్రసవాలకే ప్రాధాన్యమిస్తున్నారు. రోజు, సమయం, స్థలంతో పాటు అనస్థీషియా ఇవ్వడం, బిడ్డ బయటకు రావడం కూడా కుటుంబ సభ్యులే నిర్ణయిస్తున్నారు. ఆ ఇంటికి సంబంధించిన ప్రత్యేకమైన రోజు, లేదంటే ఎవరిదైనా పుట్టిన రోజు, పెళ్లి రోజు, లేకుంటే పురోహితుడు నిర్ణయించిన సమయం కచ్చితంగా పాటిస్తున్నారు. దీనివల్ల సీసెక్షన్లు పెరిగాయి. దీనిని సిజేరియన్ డెలివరీ ఆఫ్ మెటర్నల్ రిక్వెస్ట్ (సీడీఎంఆర్) అంటారు. ప్రసవాలు చేయడానికి సంబంధించిన నిబంధనల్లో ఇది లేకున్నా ప్రస్తుతం సాధారణమైంది. దీంతో పాటు గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు ఓపిక తగ్గిపోతుంది. గర్భిణికి నొప్పులు రాగానే సర్జరీ చేయాలని చెబుతున్నారు. సాధారణ కాన్పు కావాలంటే ఓపిక అవసరం. ప్రసవానికి సుమారు 24 గంటలు పడుతుంది. గర్భసంచి ముఖద్వారం 0–10 సెంటీమీటర్లు తెరుచుకుంటేనే బిడ్డ బయటకొస్తుంది. ఈ లోపు కుటుంబ సభ్యులు ఓపిక పట్టలేకపోతున్నారు. తద్వారా సర్జరీ చెయ్యాల్సిన అవసరం తలెత్తుతోంది. పీనట్ బాల్, రౌండ్ బాల్, కివీ వాక్యూమ్ పంప్ వంటి అధునాతన పద్ధతులను ఉపయోగించి సాధారణ కాన్పులకు వీలుంటుందని వైద్యులు చెబుతున్నారు.

సిజేరియన్లదే సింహభాగం

16 నెలల కాలంలో సిజేరియన్లదే సింహభాగం. 2024 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జూలై వరకూ కోనసీమ జిల్లాలో 22,094 డెలివరీలు జరగ్గా, ఇందులో 16,409 (74 శాతం) సిజేరియన్లేనని వైద్య ఆరోగ్య శాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. 5,685 మందికి (26 శాతం) మాత్రమే సాధారణ కాన్పులు జరిగాయి.

కారణాలు ఎన్నో..

సిజేరియన్లు పెరగడానికి వివిధ కారణాలు ఉన్నాయి. రక్తహీనత, నెగిటివ్ రక్త గ్రూపు ఉండటం, ఇతర సమస్యలతో బాధపడుతున్న గర్భిణులను పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొస్తున్నారు. అప్పుడు కచ్చితంగా సిజేరియన్ చేయడం తప్ప మరో మార్గం ఉండడం లేదు. అదే సందర్భంలో మొదటిసారి కాన్పు కోసం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే వారిలో తక్కువ స్థాయిలో సిజేరియన్లు చేస్తున్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



సాధారణ ప్రసవాలకు అధిక సంఖ్యలో గర్భిణులు అంగీకరించడం లేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోనే సిజేరియన్లు అధికంగా జరుగుతున్నాయి. దీనికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో వేచిచూసే ధోరణి లేకపోవడం ప్రధాన కారణం. సిజేరియన్ కోసం డాక్టర్లపై వివిధ రూపాల్లో ఒత్తిడి తీసుకు వస్తున్నారు.

–డాక్టర్ ఎస్.ప్రవీణ్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, రామచంద్రపురం

మొదటి నుంచీ అవగాహన అవసరం



సాధారణ ప్రసవాలు పెరగాలంటే ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం. నేటి కాలంలో పురిటి నొప్పులు భరించేందుకు గర్భిణులు సిద్ధంగా ఉండడం లేదు. గర్భం దాల్చినప్పటి నుంచే తల్లిదండ్రులు ఏ పనులు చెయ్యనివ్వడం లేదు. తొమ్మిదో నెల వరకూ చిన్న చిన్న ఇంటి పనులు చేసుకోవడం మంచిది. పురిటి నొప్పులు భరించగలిగేలా మొదటి నుంచీ అవగాహన కల్పిస్తే మంచిది.

–పి.ప్రశాంతి, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ, మండపేట

ఒత్తిడి అధికమైతే..



సాధారణ ప్రసవాలు చేయడానికే ప్రాధాన్యమిచ్చేలా చూస్తున్నాం. చిన్న వయసులో గర్భం దాల్చిన వారు నొప్పులు తట్టుకోలేక సిజేరియన్‌కే మొగ్గు చూపుతున్నారు. సాధ్యమైనంత వరకూ సాధారణ ప్రసవాలు చేయడానికి చూస్తున్నాం. గర్భిణి, వారి కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి అధికమైతే ఏరియా ఆస్పత్రికి పంపిస్తుంటాం.

–సీహెచ్ రమ్యశ్రీ, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం

వేలం... కూటమి గాలం

- నాళంవారి సత్రం భూముల కౌలు వేలం మళ్లీ వాయిదా
- కూటమి నేతల ఒత్తిళ్లతో ఖరారు కాని వైనం
- నచ్చిన వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నం


శృంగవృక్షంలోని నాళంవారి సత్రం వ్యవసాయ భూములు

తొండంగి: వేలం నిర్వహించకుండా 'కూటమి' గాలం వేసింది.. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమకు నచ్చిన వారికి మేలు చేసేందుకు ప్రయత్నిస్తుంది.. సత్రం భూముల కౌలు వేలాన్ని మళ్లీ మళ్లీ వాయిదా వేస్తూ రైతులను ఇబ్బంది పెడుతోంది.. సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న నాళంవారి సత్రం దాతల ఆశయాలకు కూటమి పార్టీ నేతల ఒత్తిడితో దేవదాయ, ధర్మదాయశాఖ యంత్రాంగం తూట్లు పొడుస్తుంది. రాజమహేంద్రవరం నాళంవారి సత్రంలో శుక్రవారం నిర్వహించిన శృంగవృక్షంలోని భూముల కౌలు వేలాన్ని అధికారులు మళ్లీ వాయిదా వేయడంతో కౌలు వేలం కోసం వెళ్లిన రైతులంతా నిరాశగా వెనుదిరిగారు. ఒకపక్క ఖరీఫ్ సాగు కాలం ప్రారంభమైనా భూములకు కౌలు వేలం పూర్తి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. నాళంవారి సత్రానికి చెందిన 268.64 ఎకరాల భూమి శృంగవృక్షంలో ఉంది. ఈ భూములకు ప్రతి మూడేళ్లకు ఒకసారి కౌలు వేలం నిర్వహించగా వచ్చిన ఆదాయంతో సత్రం ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కాగా ఈ ఏడాది కౌలు కాలం ముగియడంతో ఏప్రిల్‌లో దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు, సత్రం అధికారులు కలిసి శృంగవృక్షం పంచాయతీ కార్యాలయంలో కౌలు వేలం ప్రక్రియ నిర్వహించారు. పాత బకాయిల వసూళ్ల సాకుతో కౌలు వేలాన్ని వాయిదా వేశారు. మళ్లీ జూలై 23న రాజమహేంద్రవరం నాళం వారి సత్రం కార్యాలయంలో కౌలు వేలం నిర్వహించారు. 268.64 ఎకరాలకు సంబంధించి 13 బిట్లుగా కౌలు వేలం నిర్వహించగా, మొదటి బిట్టు 27.19 ఎకరాలకు శృంగవృక్షంకు చెందిన రైతు యనమల నాగేశ్వరరావు రూ.3.68 లక్షలకు హెచ్చుపాటగా కౌలు ఖరారు చేసుకున్నారు. అదే విధంగా రెండో బిట్టుగా 25.85 ఎకరాలకు మరో రైతు అమృత లోవబాబు రూ.5.01 లక్షలకు హెచ్చుపాటగా వేలం ఖరారు చేసుకున్నారు. కాగా మిగిలిన బిట్లు వేలం నిర్వహించగా, వేలానికి వచ్చిన రైతులు వేలం స్థలం నుంచి వెళ్లిపోయారంటూ అధికారులు మిగిలిన 11 బిట్లుకు కౌలు వేలాన్ని వాయిదా వేశారు. తిరిగి శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్టు శృంగవృక్షంలో రైతులకు తెలియడంతో వేలంలో పాల్గొనేందుకు రాజమహేంద్రవరం నాళంవారి సత్రానికి కొద్ది మంది రైతులు వెళ్లారు. అక్కడకు వెళ్లిన రైతులకు కౌలు వేలం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించడంతో నిరాశగా వెనుతిరిగారు. తొండంగి మండలానికి చెందిన కూటమి పార్టీ నేతలు అధికారులకు ఫోన్లు చేయడంతోనే కౌలు వేలాన్ని వాయిదా వేశారని రైతులు వాపోతున్నారు. ఇటీవల తొండంగిలో పిఠాపురం శ్రీసంస్థాన సత్రం భూముల కౌలు వేలం ప్రక్రియను కూడా కూటమి పార్టీ నేతల ఆధ్వర్యంలో పోలీసుల బెదిరింపులతో తమకు నచ్చిన వారికి కౌలు వేలాన్ని కట్టబెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. అదేవిధంగా నచ్చిన వారికి కౌలు వేలాన్ని కట్టబెట్టేందుకే కూటమి నేతల ఒత్తిళ్లతో సత్రం ఆదాయానికి గండికొడుతూ అధికారులు పలుమార్లు వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ పంట కాలం ప్రారంభం కావడంతో కౌలు వేలం ఖరారు కాకపోవడంపై మండిపడుతున్నారు. వీలైనంత త్వరగా శృంగవృక్షంలోనే సత్రం అధికారులు కౌలు వేలాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

రత్నగిరిపై సీఎన్‌జీ కారు దగ్ధం


కారుకు అంటుకున్న మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తున్న సిబ్బంది

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని హరిహరసదన్ సత్రం వద్ద నిలిపి ఉంచిన సీఎన్‌జీ (కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్) కారు దగ్ధమైంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం నుంచి గురువారం అర్ధరాత్రి ఆ కారులో వచ్చిన భక్తులు కారును హరిహరసదన్ సత్రం ఎదురుగా నిలిపి ఉంచి ఆ సత్రంలో బస చేశారు. అయితే వారు నిలిపిన అర గంటలోనే కారు నుంచి పెద్ద శబ్దంతో మంటలు వచ్చాయి. అగ్నినిరోధక యంత్రాలతో సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ నిమిషాల వ్యవధిలో కారు కాలిపోయింది. దాంతో సెక్యూరిటీ సిబ్బంది ఆ కారు పక్కన నిలిపి ఉంచిన ఇతర కార్ల యజమానులను అప్రమత్తం చేసి ఆ కారుకు దూరంగా పెట్టించారు. ఓ కారు యజమాని అందుబాటులోకి రాకపోవడంతో భద్రతా సిబ్బంది కారు అద్దాలు బద్దలు కొట్టి ఆ కారు హేండ్ బ్రేక్ తీసి దానిని దూరంగా నెట్టారు. అయితే దగ్ధమవుతున్న కారు వేడికి ఆ కారు కూడా కొంతమేర పాడైంది. కాగా, ఖమ్మం నుంచి సుమారు ఏడు గంటల పాటు కారును ఎక్కడా ఆపకుండా నడుపుతూ రావడంతో కారు వేడెక్కి నిలిపిన వెంటనే మంటలు చెలరేగి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువాలోని వస్తువులను మంచంపై పడవేసిన దృశ్యం

రాజోలు: ఇంట్లో వారు ఊరు వెళ్లారని తెలుసుకుని గుర్తు తెలియని వ్యక్తులు ములికిపల్లిలోని ఓ ఇంటిని గుల్ల చేశారు. ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలోని రూ.ఐదు లక్షలు, ఆరు కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్ శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆయన కథనం ప్రకారం.. ఈ నెల 7న ఇంటి యజమాని కట్టా వెంకటలక్ష్మి తమ బంధువుల ఇల్లు ఏలూరుకు వెళ్లారు. 8వ తేదీ ఉదయం పని మనిషి ఇంటి వాకిలి శుభ్రం చేసేందుకు రాగా, ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో వెంటనే ఆ సమాచారాన్ని వెంకటలక్ష్మికి ఫోన్‌లో తెలిపింది. ఏలూరు నుంచి వెంకటలక్ష్మి వచ్చి చూసేసరికి ఇంట్లోని బీరువాను పగలకొట్టి, అందులో ఉన్న రూ.ఐదు లక్షలు, ఆరు కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రాజోలు సీఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది.

విలీన అంశంపై 10న విస్తృత సమావేశాలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలన్న డిమాండ్‌పై ఈ నెల 10న విస్తృత స్థాయిలో సమావేశాలను నిర్వహించనున్నట్టు అఖిలపక్ష కమిటీ చైర్మన్ కామన ప్రభాకరరావు శుక్రవారం వెల్లడించారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు కపిలేశ్వరపురం మండలం అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీసత్యనారాయణ కల్యాణ మండపంలో, సాయంత్రం 4 గంటలకు మండల కేంద్రమైన రాయవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోనూ సమావేశాలను నిర్వహించనున్నామన్నారు. ఆయా సమావేశాల్లో మేధావులు, విద్యార్థులు, యువజన, మహిళలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొనాలని కోరుతున్నామని కామన తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులపై కేసు

రామచంద్రపురం రూరల్: అదనపు కట్నం కోసం అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని తోటపేట గ్రామానికి చెందిన సోరపల్లి కనక మహాలక్ష్మికి 2023లో సోరపల్లి మల్లేష్‌తో వివాహమైంది. ఆ సమయంలో రూ. 3 లక్షల కట్నంతో పాటు లాంఛనాలు ముట్టచెప్పారు. ప్రస్తుతం మరో రూ.5 లక్షలు కట్నం తీసుకు రావాలని భర్త మల్లేష్, అత్త గనిలక్ష్మి, ఆడపడుచు పాలని మహాలక్ష్మి వేధిస్తున్నారంటూ ఆమె ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మారేడుబాకలో గంజాయి కలకలం


మండపేటలో కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కపిలేశ్వరపురం (మండపేట): మారేడుబాకలో గంజాయి వ్యవహారం కలకలం రేపింది. మండపేట పట్టణాన్ని ఆనుకుని ఉన్న మారేడుబాకలోని ఖాళీ స్థలంలో యువకులు గంజాయి తాగుతున్నారన్నారంటూ గురువారం పట్టణ పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై ఎన్.రాము తన సిబ్బందితో కలసి దాడి చేశారు.

మారేడుబాక గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను, అనపర్తి మండలానికి చెందిన ఒక యువకుడిని, మండపేటకు చెందిన 17 ఏళ్ల బాలికను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు 300 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచగా రిమాండ్ విధించినట్టు ఎస్సై రాము శుక్రవారం తెలిపారు. బాలికను రాజమహేంద్రవరం డీపీఓ జువైనల్ హోమ్‌లో హాజరు పరిచామన్నారు.

విద్యుత్ తీగలపై పడి యువకుడి మృతి


విద్యుత్ తీగలపై పడి మృతి చెందిన గురుమూర్తి

యానాం: స్థానిక గౌతమీ గోదావరి రాజీవ్ రివర్ బీచ్ వద్ద ఉన్న కూనపురెడ్డి కాంప్లెక్స్‌లో లాడ్జిపై భాగం నుంచి గురువారం అర్ధరాత్రి విద్యుత్ తీగలపై పడిన యువకుడు మృతి చెందినట్లు ఎస్సై పునీత్‌రాజ్ తెలిపారు. మృతి చెందిన యువకుడు ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామ నివాసి చింతా గురుమూర్తి (22)గా గుర్తించామన్నారు. మృతుడు ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడని వివరించారు. అర్ధరాత్రి వేళ విద్యుత్ తీగలపై యువకుడు పడి ఉన్నాడని సమాచారం అందడంతో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అక్కడకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. యానాం పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బందికి ఆయన సమాచారం అందించారు. వారు వచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేసి మృతదేహాన్ని కిందకు దించారు. ముగ్గురు యువకులు గురువారం రాత్రి లాడ్జిలో దిగి మద్యం తాగారన్నారు. అనంతరం ఈ ఘటన చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. యానాం జీజీహెచ్‌కు మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పునీత్‌రాజ్ తెలిపారు.